# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 193 పేజీలు : 04 వెల రూ. 2 ఆదివారం 18 - 01 - 2026





నల్గొండకు మున్సిపల్ కార్పొరేషన్ హోదా

# పేదలకు పంచేందుకు ప్రభుత్వం వద్ద భూమి లేదు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జడ్చర్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు
- చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి భూమి పూజ
- తాను విద్యా సంస్థలకే ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడి
- కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, మంత్రి దామోదర రాజనరసింహ, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు
- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి
- తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకే తొలి ప్రాధాన్యత ఇచ్చారని రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : బూర్గుల రామకృష్ణారావు తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా బిడ్డకు సీఎం పదవి దక్కిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో రేవంత్ రెడ్డి పర్యటించారు. జడ్చర్లలో పలు అభివృద్ధి పనులకు సీఎం, మంత్రులు శంకుస్థాపన చేశారు. జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి భూమి పూజ చేసిన సీఎం, మహబూబ్‌నగర్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, మంత్రి దామోదర రాజనరసింహ, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. - మిగతా 2 లో

## 'సేవ్ సికింద్రాబాద్'
### ర్యాలీకి అనుమతి నిరాకరణ



- ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం
- నగరం అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంటే నిరసన తెలిపే హక్కు లేదా అని నిలదీత
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుగ్లక్ పనులు చేస్తోందని విమర్శ
- అరెస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం

హైదరాబాద్ : హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల అస్తిత్వాన్ని దెబ్బతీస్తే ఉపేక్షించేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'సేవ్ సికింద్రాబాద్' ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, - మిగతా 2 లో




## తెలంగాణలో కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు

121 మున్సిపాలిటీల్లో ఎస్టీలకు 5, ఎస్సీలకు 17, బీసీలకు 38 చైర్‌పర్సన్ పదవుల కేటాయింపు

మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల కేటాయింపు

మహిళా జనరల్‌కు హైదరాబాద్ కార్పొరేషన్ కేటాయింపు

# బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రావాల్సిన సమయం వచ్చింది
- బంగాల్‌లోని మాల్డాలో పర్యటించిన ప్రధాని మోదీ
- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- హౌవ్‌డా- టీఎంసీ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన ప్రధాని
- కేంద్రం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ కొల్లగొడుతోందని విమర్శ



ఢిల్లీ : బంగాల్ ప్రజలు నిజమైన మార్పును కోరుకుంటున్నారని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాల్సిన సమయం వచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. టీఎంసీ అవినీతి, హింసతో నిండిన పార్టీ అని మండిపడ్డారు. బిహార్‌లో ఎన్ డీఏ విజయం సాధించిందని, ఇప్పుడు బంగాల్ సమయం వచ్చిందని స్పష్టం చేశారు. శనివారం బంగాల్‌లోని మాల్దాలో పర్యటించిన ప్రధాని మోదీ హౌవ్ డా- అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య తిరిగే వందే భారత్ తొలి స్లీపర్ రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పబ్లిక్ మీటింగ్ ఆయన మాట్లాడారు. శనివారం నుంచి వందేభారత్ స్లీపర్ క్లాస్ రైళ్లు బంగాల్‌లోని హౌరా నుంచి అసోంలోని గువహతి మధ్య రాకపోకలు సాగిస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు. కాళీ మాతకు నెలవైన పుణ్యభూమిని కామాఖ్య మాత పూజలు అందుకునే పుడమితో ఈ రైలు అనుసంధానిస్తుందని చెప్పారు. ఈ మార్గంలో 'వందేభారత్'లో ప్రయాణంతో మర్చిపోలేని, సౌకర్యవంతమైన, అద్భుత అనుభవాన్ని ప్రయాణికులు పొందుతారని తెలిపారు. "ప్రస్తుతం భారతీయ రైల్వే ఆధునికీకరణ దశలో ఉంది. దేశ రవాణా సౌకర్యాలను ఆధునీకరించడంతో పాటు స్వయం సమృద్ధిపై మేం ఫోకస్ పెట్టాం. వందేభారత్‌లు మేడిన్ ఇండియా రైళ్లు. ఇప్పుడు ఐరోపా, అమెరికా కంటే ఎక్కువ రైల్వే బోగీలను భారత్ తయారు చేస్తోంది. ఈ మార్పు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తోంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఒకప్పుడు విదేశీ రైళ్ల ఫొటోలు, వీడియోలను చూసి, ఇలాంటివి మనదేశంలో ఎప్పటికొస్తాయో అని భారతీయులు అనుకునేవారని ప్రధాని మోదీ తెలిపారు. ఇప్పుడు అవే తరహా రైళ్లలో భారతీయులు నిత్యం ప్రయాణిస్తున్నారని ఆయన చెప్పారు. విదేశీయులు భారతీయ అధునాతన రైళ్ల వీడియోలు తీసి, ఇక్కడ విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయనే విషయాన్ని ప్రపంచానికి చెబుతున్నారని మోదీ - మిగతా 2 లో




## పురుషులకు ఉచిత సిటీ బస్సు ప్రయాణం

ఎన్నికల హామీలను ప్రకటించిన అన్నాడీఎంకే

ఐదు ఎన్నికల హామీలను ప్రకటించిన పళనిస్వామి

కుటుంబంలో మహిళా యజమానికి నెలకు రూ. 2 వేలు

పేదలకు ఇళ్లు కేటాయిస్తామని హామీ

5 లక్షల మహిళలకు ద్విచక్ర వాహనాల కొరకు రూ. 25,000 సబ్సిడీగా 'అమ్మ టూ వీలర్ స్కీమ్'

గత ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను డీఎంకే కాపీ కొట్టింది

## గణతంత్ర దినోత్సవం వేడుకలకు ఉగ్రవాద ముప్పు !




- దాడులకు ప్రణాళికలు రచిస్తున్న ఖలిస్థానీ, బంగ్లాదేశ్ ఉగ్రవాద సంస్థలు
- హర్యానా, ఢిల్లీ-ఎన్‌సీఆర్, యూపీ, రాజస్థాన్ రాష్ట్రాలలో హైఅలర్ట్
- ఢిల్లీతో పాటు ప్రముఖ నగరాలు, ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశాలు

ఢిల్లీ : ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలను లక్ష్యంగా చేసుకుని ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద సంస్థలు దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. హర్యానా, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు సమాచారం ఉందని, అక్కడ హైఅలర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీయడానికి ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేస్తోన్న ఉగ్రవాద సంస్థలు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించుకుంటున్నాయని పేర్కొన్నాయి. గత ఏడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో - మిగతా 2 లో

## ప్రజానాడి




## 11 సీట్లకే పరిమితమైనా మీ 'తాచుపాము' బుద్ధి మారలేదు





- రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి
- ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషం చిమ్ముతోందని మంత్రి పార్థసారథి విమర్శ
- నాడు అసెంబ్లీలో జై కొట్టి, అధికారంలోకి వచ్చాక జగన్ మాట మార్చారని ఆరోపణ
- సొంత ప్యాలెస్‌లకు వేల కోట్లు ఖర్చుపెట్టారని, రాజధానికి మాత్రం అడ్డుపడుతున్నారని ఫైర్
- అమరావతి పనులు వేగవంతం చేశాం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే కూటమి లక్ష్యమని స్పష్టీకరణ

అమరావతి : "2024 ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై కేవలం 11 సీట్లకే పరిమితమైనా వైసీపీ నేతల 'తాచుపాము' బుద్ధి మారకపోవడం రాష్ట్ర దౌర్భాగ్యం" అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిపై, ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. - మిగతా 2 లో

# ప్రపంచ క్లీన్ ఎనర్జీలో ఏపీకి అగ్రస్థానం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు పనులు ప్రారంభం
- ఏపీని దేశపు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చడమే లక్ష్యమన్న సీఎం
- ఇది రూ.83,000 కోట్లతో చేపడుతున్న సమీకృత ప్రాజెక్టు అని వెల్లడి
- ఇక్కడి గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, ఇతర దేశాలకు ఎగుమతి చేయనున్నారు
- ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగంలో ఏపీ అగ్రస్థానంలో నిలుస్తుందన్న చంద్రబాబు
- 'గ్రీన్ అమ్మోనియా' భవిష్యత్తులో పెనుమార్పునకు నాంది
- బొగ్గు వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది
- కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెనుమార్పులు
- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి బాగా పెంచాలని ప్రధాని కోరారు




కాకినాడ : ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా, నికర హరిత ఇంధన ఎగుమతి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా మరో చరిత్రాత్మక ముందడుగు పడిందని ఆయన ప్రకటించారు. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 1.5 మిలియన్ టన్నుల సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు పరికరాల ఏర్పాటు కార్యక్రమం శనివారం ప్రారంభమైందని తెలిపారు. ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నామని ముఖ్యమంత్రి తన ప్రకటనలో - మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్ అడుగుజాడల్లో చైనా



మంచేదైనా జరిగితే తమ ఖాతాలో వేసుకోవటానికి సిద్ధపడేవాళ్లు కోకొల్లలు. ఇది లోకోత్తర సత్యం. ఒకరకంగా అదొక వ్యాధి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆ సమస్య ఉంది. తన ప్రమేయం లేకుండా ముగిసిన యుద్ధాలనూ, ఇంకా ముగియని యుద్ధాలనూ తానే ఆపానని చెప్పుకోవడంతోపాటు ఉనికిలో లేనివాటికి కూడా అడ్డుచక్రం వేశాననటం ఆయనకే చెల్లింది. ఆ బాణీ ఇంకా ఆపలేదు. ఇప్పుడు చైనా వంతు వచ్చినట్టుంది. 2025లో భారత్‌పాక్ ఘర్షణలు నివారించటంతోపాటు అనేక ఇతర యుద్ధాలను ఆపిన ఘనత తమదంటూ తాజాగా వాంగ్‌యీ ప్రకటించుకున్నారు. ఆ రెండు దేశాలూ అనేక రంగాల్లో పోటీపడుతున్నాయి. ఆర్థికంగా ఇప్పటికీ అమెరికాదే పైచేయి అయినా, రేపో మాపో దాన్ని చైనా అధిగమిస్తుందని ఎవరో కాదు... ఆర్థిక నిపుణులే దండోరా వేస్తు న్నారు. ఆ విషయంలో చైనాను ప్రశంసించాల్సిందే! అమెరికాతో పోలిస్తే ఎక్కడో అట్ట దుగునుండే దేశాన్ని 75 ఏళ్లలోనే ఈ స్థాయికి తీసుకురావటం మాటలు కాదు మరి. అంతమాత్రాన అమెరికా చెప్పే అబద్ధాలను కూడా వల్లెవేయటం వంటి చౌకబారు అనుకరణలు బెడిసికొడతాయని చైనా గ్రహించకపోవటం క్షమార్హం కానిది. కశ్మీర్‌లోని పెహల్గాంలో పాక్ నుంచి చొరబడిన ఉగ్రవాదులు అనేకమంది అమాయ కులను పొట్టనబెట్టుకున్న వైనం తర్వాత గత ఏడాది మే మొదటివారంలో మన దేశం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో అక్కడి ఉగ్ర స్థావరాలపై దాడులు చేయటం, దానికి ప్రతిగా పాకిస్తాన్ సైన్యం మనపై దాడి చేసే ప్రయత్నం, మనం తిప్పికొట్టడం, ఎదురు దాడి చేయడం వంటివి జరిగాయి. చివరకు కుదిరిన కాల్పుల విరమణ వెనక రెండు దేశాల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్లు (డీజీఎంలు) ఉన్నారని మన దేశం చెబుతోంది. ఇలాంటి విషయాల్లో మూడో పక్షం జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించ బోమని అప్పట్లోనే స్పష్టం చేసింది. నిజానికి 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా పాక్ సైన్యం వాడిన ఆయుధ సామగ్రిలో చైనా సరఫరా చేసినవి కూడా ఉన్నాయని అప్పుడే బయటపడింది. ఆ సామగ్రి 81 శాతం అని కూడా తేలింది. పాకిస్తాన్ మనపై ప్రయోగించిన ఆయుధ సామగ్రి చూశాక, ఈ ఘర్షణను 'సజీవ ప్రయోగశాల'గా చైనా ఉపయోగించుకున్నట్టు కనబడుతోందని కూడా మన దేశం విమర్శించింది. అలాంటి దేశం 'తగుదు నమ్మా...' అంటూ ఇరుపక్షాల మధ్యా రాజీకీ దౌత్యం నెరపానని ఇప్పుడు గప్పాలు కొడుతోంది. లోపాయకారీగా ఘర్షణలను ఎగదోయటం, పైకి శాంతి వచనాలు వల్లించటం ఇటీవలి ధోరణేం కాదు. ఇలాంటి జిత్తులమారి ఎత్తుగడల్లో అమెరికా ఆరితేరింది. ఇజ్రా యెల్ సాగించే అన్ని దాడుల వెనకా ఆ దేశం ఉంటుంది. అవే దాడుల్ని ఆపినట్టు కనబడటంలో ముందుంటుంది. శాంతి సాధన కోసం 'ఏ సమస్యనైనా వస్తునిష్ఠతో చూడటం, న్యాయమైన వైఖరి తీసుకోవటం' తమ విధానమని... లక్షణాలనూ, మూల కారణాలనూ తొలగించటమే తమ ధ్యేయమని వాంగ్‌యీ చెప్పుకున్నారు. డాలర్ ఇంకా శాసిస్తూనే ఉంది కనుక అమెరికా ఇలాంటి అబద్ధాలు చెప్పినా ఏదోమేరకు చెల్లు బాటవుతాయి. సుంకాలు పెంచుతామని బెదిరించానంటే 'అవును కాబోలు...' అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ చైనా సైతం 'అన్నీ నేనే... అంతా నేనే' అని అనటం ఎబ్బెట్టుగా ఉంటుంది. అదను చూసుకుని పక్కనున్న తైవాన్‌ను కబళించాలని ప్రయత్నిస్తూ, మనతో సరిహద్దుల్లో అకారణ వైరానికి దిగుతూ, అరుణాచల్ ప్రదేశ్‌లో గ్రామాల పేర్లు మార్చు కుని మురిసిపోతూ ఇలా తటస్థత నటించటం అనైతికత. చైనాకూ, తైవాన్‌కూ మధ్య రాజీ కుదర్చటానికి ప్రయత్నిస్తానని మన దేశం ముందుకొస్తే చైనా అంగీకరిస్తుందా? అధికారంలోకొచ్చిన నాటి నుంచీ నోబెల్ బహుమతి కోసం వెంపర్లాడటం ట్రంప్‌కు ఎక్కువైంది. బహుశా ఆయనకు మోకాలడ్డాలని చైనా ఏమైనా ప్రయత్నిస్తోందేమో! అలా చేయదల్చుకుంటే ట్రంప్ తప్ప వేరెవరూ చైనాను ఆటంకపరచరు. తామిచ్చే శాంతి బహుమతి సైతం ప్రతిష్ఠాత్మకమైనదిగా ఉండేలా చూసుకొనే బాధ్యత నోబెల్ కమిటీది. ఈలోగా లేని పెద్దరికాన్ని ప్రదర్శించటం వల్ల నవ్వులపాలు కావటం ఖాయమని అటు ట్రంప్, ఇటు చైనా తెలుసుకోవాలి.

## భీమన్న ఖండ్రేగారి మృతికి చింతిస్తున్నా

**మొదటిపేజీ తరువాయి** – కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ భీమన్న ఖండ్రే మృతి పట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఖండ్రే ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు."కర్ణాటక రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి, మిత్రులు ఈశ్వర్ ఖండ్రేగారి తండ్రి, మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ భీమన్న ఖండ్రేగారి మృతికి చింతిస్తున్నాను. వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా భీమన్న ఖండ్రే తుదిశ్వాస విడిచారని తెలిసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. స్వాతంత్ర్య సమరంలో, హైదరాబాద్ కర్ణాటక విముక్తి, కర్ణాటక సమైక్యత ఉద్యమాల్లో డాక్టర్ భీమన్న ఖండ్రే గారు కీలక పాత్ర పోషించారు. ఈశ్వర్ ఖండ్రే గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు న్నాను" అని ట్వీట్ చేశారు.కాగా, 102 ఏళ్ల వయసులో డా. భీమన్న ఖండ్రే కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా బీదర్ జిల్లా భాల్కి పట్టణంలోని తన నివాసంలో గత అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. గత కొద్దిరోజులుగా శ్వాసకోశ సమస్యలు, రక్తపోటుతో బాధపడుతున్న ఆయన, ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు సమాచారం. డా. భీమన్న ఖండ్రే స్వాతంత్ర్య సమర యోధుడిగా మాత్రమే కాకుండా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, అలాగే రవాణా మంత్రిగా కూడా సేవలందించారు.రాజకీయ,సామాజిక సేవలతో ఆయన కర్ణాటక ప్రజల్లో విశేష గౌరవాన్ని సంపాదించుకున్నారు.

## బీహార్‌లో గెలిచాం..
## బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

**మొదటిపేజీ తరువాయి** – పేర్కొన్నారు."మమతా బెనర్జీ సర్కారు బంగాల్ ప్రజలను కేంద్ర ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్ నుంచి లబ్ధి పొందకుండా అడ్డుకుంటోంది. ఆ పథకంతో దేశంలోని అల్ప ఆదాయ వర్గాల ప్రజలంతా ఉచితంగా ఆరోగ్య బీమా కవరేజీని పొందొచ్చు. మనసులేని, కర్కశమైన మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోపిడీ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహాయం బంగాల్ ప్రజలకు చేరకుండా అడ్డుపడుతోంది. మేం వరద సహాయక నిధులను 40 సార్లు బంగాల్‌కు పంపించాం. కానీ వాటిని బాధిత కుటుంబాలకు మమత సర్కారు పంపిణీ చేయలేదు. పేదలకు చెందాల్సిన ధనాన్ని అవినీతిమయ టీఎంసీ ప్రభుత్వం లూటీ చేస్తోంది. నాకు, బంగాల్ ప్రజలకు శత్రువుగా టీఎంసీ ప్రభుత్వం మారింది. బంగాల్‌లోని పేదలందరికీ సొంత ఇళ్లు ఉండాలి. ఉచిత రేషన్ అందాలి. సంక్షేమ పథకాల ప్రయోజనాలన్నీ లభించాలి. ఇందుకోసం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశాన్ని ఇచ్చి చూడాలి. తప్పకుండా బంగాలీలు మార్పును కోరుకుంటారని నేను నమ్ముతున్నాను" అని ప్రధాని మోదీ తెలిపారు."విభజన రాజకీయాలు చేసే వాళ్లే దశాబ్దాల పాటు తూర్పు భారత రాష్ట్రాలను పరిపాలించారు. వాటికి విద్వేష, విభజన రాజకీయాల సంకెళ్ల నుంచి బీజేపీయే విముక్తి కల్పించింది. బీజేపీ ప్రభుత్వాల సుపరిపాలనను పొందుతున్న రాష్ట్రాలు ఇప్పుడు బంగాల్ చుట్టూ ఉన్నాయి. తొలిసారిగా ఒడిశాలోనూ బీజేపీ సర్కారు ఏర్పడింది. చాలా ఏళ్లుగా బీజేపీని త్రిపుర విశ్వసిస్తోంది. అసోంలో ఇటీవలే జరిగిన పలు ఎన్నికల్లో బీజేపీ రాణించింది. అక్కడి ప్రజలు మాపై నమ్మకాన్ని ఉంచారు. బిహార్ సైతం ఎన్‌డీఏ పాలననే కోరుకున్నారు. మా కూటమినే ఆశీర్వదించారు. తదుపరిగా బంగాల్‌లోనూ బీజేపీ సుపరిపాలన అందాల్సి ఉంది. ఈ సభకు వచ్చిన ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే బంగాల్‌లోనూ ప్రభుత్వం మారుతుందని అనిపిస్తోంది. అత్యంత బాధ్యతారహిత, నిరంకుశ టీఎంసీ సర్కారును తొలగిస్తేనే బంగాల్ డెవలప్ సాధ్యమవుతుంది" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## పురుషులకు ఉచిత సిటీ బస్సు ప్రయాణం

**మొదటిపేజీ తరువాయి** – తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి అన్నాడీఎంకే ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్ 109వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి... ఐదు ప్రధాన హామీలను ప్రకటించారు. వీటిలో పురుషులకు ఉచిత సిటీ బస్సు ప్రయాణం, ప్రతి కుటుంబ మహిళకు నెలకు రూ. 2,000 జమ చేసే 'మగళీర్ కులవిళక్కు' పథకం, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు మరియు పట్టణాల్లో అపార్ట్ మెంట్ల పంపిణీ, ఎస్సీ జంటలకు ప్రత్యేక ఇళ్ల స్థలాల కేటాయింపు, అలాగే 5 లక్షల మహిళలకు ద్విచక్ర వాహనాల కొరకు రూ. 25,000 సబ్సిడీగా 'అమ్మ టూ వీలర్ స్కీమ్' ఉన్నాయి.గత ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను డీఎంకే కాపీ కొట్టిందని పళనిస్వామి విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా నడిపినట్లు చెప్పారు. కరోనా సమయంలో కూడా ప్రజలకు అన్ని పథకాలను సక్రమంగా అందించామని తెలిపారు.

## గణతంత్ర దినోత్సవం వేడుకలకు

**మొదటిపేజీ తరువాయి** – కారు బాంబు పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీతో పాటు ప్రముఖ నగరాలు, ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్లు విదేశాల నుంచి పనిచేస్తున్న ఖలిస్తానీ, రాడికల్ హ్యాండ్లర్లకు సహకరిస్తున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. "ఉగ్రవాద సంస్థలు తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఉపయోగించు కుంటున్నాయి" అని పేర్కొన్నాయి.

# ప్రపంచ క్లీన్ ఎనర్జీలో ఏపీకి అగ్రస్థానం

**మొదటిపేజీ తరువాయి** – పేర్కొన్నారు.2024 అక్టోబర్‌లో తమ ప్రభుత్వం ప్రారంభించిన సమీకృత క్లీన్ ఎనర్జీ పాలసీ ఫలాలను ఇస్తోందని, ఆనాడు తామిచ్చిన హామీకి అనుగుణంగా ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం గర్వకారణమైన మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 83,000 కోట్లు) సమీకృత పెట్టుబడి వస్తోందని వివరించారు. ఈ పెట్టుబడిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనే 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్లాంట్లు కూడా ఏర్పాటవుతాయని తెలిపారు. ఇది రాష్ట్రంలో ఉన్న సమగ్రమైన క్లీన్ ఎనర్జీ వ్యవస్థకు నిదర్శనమని అన్నారు.ప్రపంచంలోనే ఈ తరహా ప్రాజెక్టు ఇదే మొదటిదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను జర్మనీతో పాటు ఇతర ప్రపంచ దేశాల మార్కెట్లకు ఎగుమతి చేస్తారని వెల్లడించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుతో ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానపరమైన మద్దతు, పారిశ్రామిక అనుకూల వాతావరణం వల్లే ఇలాంటి చరిత్రాత్మక ప్రాజెక్టులు రాష్ట్రానికి తరలివస్తున్నాయని చంద్రబాబు తన ప్రకటనలో వివరించారు.1950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ను ఉత్పత్తి చేయనున్న ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుతో 8 వేల మందికి ఉద్యోగావకాశలు లభించనున్నాయి. దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత పరిశ్రమల్లో ఒకటిగా ఇది నిలవనుంది.ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రామాన్ని మరిచిపోకూడదని, మన సంస్కృతిని కాపాడుకుంటూనే టెక్నాలజీని వాడుకోవాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ ఇది. ఇక్కడ 2027 జూన్ నాటికి మొదటి ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. ఆలోచనలను ఆచరణలో పెట్టేవారు చాలా కొద్దిమందే ఉంటారని వారిలో చలమలశెట్టి అనిల్ ఒకరు. చరిత్రను తిరగరాయడంలో తెలుగువాడు ముందున్నందుకు గర్వంగా ఉంది.బొగ్గు వినియోగం




వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్న చంద్రబాబు కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెనుమార్పులు వస్తున్నాయన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి బాగా పెంచాలని ప్రధాని మోదీ కోరుతున్నారని, 2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికిందన్నారు. 2024లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికామని సీఎం స్పష్టం చేశారు. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తయారు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు.ఆనాడు ఎన్టీఆర్ చొరవతో నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ వచ్చిందని, ఇప్పుడు గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ వచ్చిందని అన్నారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌లో 20 పోర్టులు వస్తున్నాయని, ప్రపంచంలో ఎండ పుష్కలంగా ఉండే దేశం మనదే అని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి ఏపీ అనుకూలమని అన్నారు. గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ మన రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుందన్నారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ మన రాష్ట్రానికి వరం అని తెలిపారు. కాకినాడ గురించి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటారని అన్నారు. ఇలాంటి పరిశ్రమలకు అనుకూలమైన పరిస్థితులన్నీ ఇక్కడ ఉన్నాయని తెలిపారు. ప్రజలకు మేలు జరిగే ఆలోచనలను వెంటనే అమలు చేస్తామని, 2047 నాటికి మన రాష్ట్రం స్వర్ణాంధ్రగా తయారవుతుందని వెల్లడించారు.గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయరంగానికి చాలా మేలు జరుగుతుందన్న చంద్రబాబు ప్రకృతి సేద్యం పెరగడమే అందరి ఆరోగ్యాలకు శ్రీరామ రక్ష అని తెలిపారు. ఎరువులు, పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలని సూచించారు. గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే అవకాశం ఉందని అన్నారు.యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని చంద్రబాబు వెల్లడించారు. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో ఏపీకే 25 శాతం వచ్చాయని, ఇటీవల రూ. 8.75 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. ఏపీకి ఉన్న అన్ని రకాల వనరులను ఉపయోగించుకుంటున్నామన్నారు. డ్రోన్ ట్యాక్సీలు రావాల్సిన అవసరం ఉందని, రోడ్లపై వాహనాల రద్దీ తగ్గాలని అన్నారు. ఏపీలో ఈ ఏడాదే డ్రోన్ అంబులెన్స్ కూడా ప్రారంభిస్తామని తెలిపారు. మన రాష్ట్రానికి డేటా సెంటర్లు, రోబోటిక్స్ వస్తున్నాయని, నాలెడ్జ్ ఎకానమీలో ముందున్నవారే విజేతలు అవుతారని సూచించారు. రాష్ట్రం నుంచి వందల మంది పారిశ్రామికవేత్తలు తయారుకావాలని ఆకాంక్షించారు.పర్యావరణాన్ని రక్షించుకుంటూ ముందుకు: బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అనేక కష్టనష్టాలను తట్టుకుని ఏఎం గ్రీన్ కంపెనీ పెట్టారని, చలమలశెట్టి అనిల్, మహేశ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏఎం గ్రీన్ కంపెనీ 495 ఎకరాల్లో ఏర్పాటు కానుందని, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ దిశగా మనం వేసే అడుగులు చాలా కీలకమని అన్నారు. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని వెల్లడించారు.కాలుష్యరహిత ఇంధన ప్రయాణంలో ఇదో మైలురాయి అని, రాష్ట్ర సుస్థిరాభివృద్ధిలో ఇది గేమ్ ఛేంజర్ కానుందని పవన్ స్పష్టం చేశారు. వివిధ రంగాల్లో కార్బన్ ఎమిషన్స్‌ను పెద్దస్థాయిలో తగ్గిస్తోందని, భూతాపం తగ్గించేందుకు గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు దోహదం చేస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారులను అనేక ఇబ్బందులు పెట్టిందని, కానీ తమ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అండగా ఉంటుందని వెల్లడించారు. యువతకు ఉద్యోగాల కల్పనకు ఉన్న అవకాశాలు వాడుకుంటున్నాని స్పష్టం చేశారు.

## 11 సీట్లకే పరిమితమైనా మీ 'తాచుపాము' బుద్ధి మారలేదు

**మొదటిపేజీ తరువాయి** – శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయడమే లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు."హెల్దీ-హ్యాపీ-వెల్తీ స్టేట్ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, రాష్ట్రంలో కనిపిస్తున్న ఆశాజనక వాతావరణాన్ని దెబ్బతీయడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో అమరావతికి మనస్ఫూర్తిగా 'జై' కొట్టిన జగన్మోహన్ రెడ్డి, అధికారం రాగానే 'నై' అని మాట మార్చి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించారు. ఐదేళ్ల పాటు రాజధాని లేకుండా చేసి ప్రజల కలలను విధ్వంసం చేశారు" అని పార్థసారథి మండిపడ్డారు.2019కి ముందు అమరావతే రాజధాని అని, తాను తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని నమ్మబలికిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక తుగ్లక్ పాలనను తలపించేలా మూడు రాజధానుల నాటకం ఆడారని విమర్శించారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన 29 వేల మంది రైతులను అవమానించారని, అమరావతిని ఎడారి, శ్మశానంతో పోల్చారని గుర్తుచేశారు."సొంత అవసరాల కోసం వందల ఎకరాల్లో, వేల చదరపు అడుగుల ప్యాలెస్‌లు కట్టుకున్న నాయకులు, ఐదు కోట్ల ప్రజలకు రాజధాని అవసరమా అని ప్రశ్నించడం సిగ్గుచేటు. కులాల మధ్య చిచ్చు, ప్రాంతాల మధ్య విషం చిమ్ముతూ నీచ రాజకీయాలు చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారింది" అని దుయ్యబట్టారు. అమరావతిపై ఇన్సైడర్ ట్రేడింగ్ అంటూ అసత్య ఆరోపణలు చేసి హైకోర్టు, సుప్రీంకోర్టుల చేత మొట్టికాయలు తిన్నా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని పార్థసారథి అన్నారు."పీపీపీ విధానంలో రాష్ట్రానికి వచ్చే సంస్థలను 'మేం వస్తే అరెస్ట్ చేస్తాం' అని బెదిరించడం అత్యంత జుగుప్సాకరం. ఇది రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసే కుట్ర కాదా?" అని ప్రశ్నించారు. చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మించినప్పుడు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయని, కానీ నేడు ఆ ప్రాంతం విలువ అందరికీ తెలుసని అన్నారు. అమరావతి పూర్తయితే వచ్చే లక్షల కోట్ల సంపదతోనే రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లోనూ టీసీఎస్, రిలయన్స్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని




గుర్తుచేశారు. "రాజ్యాంగంపై గౌరవం లేని వైసీపీ, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక బయట కూర్చుని విషప్రచారం చేస్తోంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఈ నిజాన్ని ప్రజలు గ్రహించి, విధ్వంసకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని మంత్రి పార్థసారథి పిలుపునిచ్చారు.

## పేదలకు పంచేందుకు ప్రభుత్వం వద్ద భూమి లేదు

**మొదటిపేజీ తరువాయి** –

అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు.తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకే తొలి ప్రాధాన్యత ఇచ్చారని రేవంత్ రెడ్డి దశాబ్దాల క్రితం కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రాజెక్టులే ఇప్పటికీ మనకు జీవనాధారమని తెలిపారు. తాను కూడా సాగునీటి ప్రాజెక్టులు, విద్యా సంస్థలకే ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. గతంలో భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాలు ఉండేదని, పీవీ నరసింహారావు ప్రభుత్వం భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి మిగులు భూములను పేదలకు పంచిందని పేర్కొన్నారు. ఇప్పుడు పేదలకు భూమి పంచేందుకు కూడా ప్రభుత్వం వద్ద భూమి లేదన్న రేవంత్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం వద్ద భూమి లేదని స్పష్టం చేశారు. సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం చేస్తోందని గుర్తు చేశారు.మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా వాటిలో పాలమూరు బిడ్డల శ్రమ ఉందన్న సీఎం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లి తట్ట పని, మట్టి పని చేసిన వాళ్లు పాలమూరు బిడ్డలని తెలిపారు. దేశంలో అత్యంత వెనకబడిన మండలం జిల్లాలోని గట్టు మండలమని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.కేసీఆర్ పదేళ్ల పాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్టు కూడా సాధించలేదని ఆరోపించారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారని అన్నారు. ప్రాజెక్టు పేరు మీద రూ.23 వేల కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ ప్రాజెక్టు పూర్తి చేయలేదని, ఉద్ధండాపూర్ జలాశయం భూనిర్వాసితులకు నిధులు చెల్లించలేదని, సంగంబండ వద్ద బండ పగలగొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.ప్రాజెక్టులకు అనుమ తులు, నిధులు తెచ్చేందుకే ప్రధాని మోదీని కలుస్తున్నానన్న రేవంత్ రెడ్డి ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తామని, తర్వాత ప్రజల కోసం కలిసి పని చేస్తామని వెల్లడించారు. తనకు ఎవరూ శత్రువులు లేరని, రాజకీయ ప్రత్యర్థులను ఎన్నికల్లోనే ఓడించానని, ఎన్నికల తర్వాత తనకు ఎవరి మీద కోపం లేదని, శత్రుత్వం లేదని, పేదరికం, నిరక్షరాస్యత మాత్రమే మనకు శత్రువులుగా భావిస్తామని తెలిపారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన చివరి జీవో నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకమని, నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారని అన్నారు. గతంలో పాలమూరు జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదని, మాజీ సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలెవరినీ తన ఫామ్‌హౌస్‌లోకి రానీయలేదని విమర్శించారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత తనదని, పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు.మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈసారి ప్రజలు తరిమికొడతారని, పదేళ్లలో రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారని అది మూడేళ్లకే కూలిందని విమర్శించారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇవాళ 3.50 కోట్ల మంది పేదలకు రేషన్‌కార్డుపై సన్నబియ్యం ఇస్తున్నామని, మహిళలకు పంపిణీ చేసిన బతుకమ్మ చీరల్లో కూడా కమీషన్లు తిన్నారని తెలిపారు. సూరత్ నుంచి కిలోల చొప్పున చవక చీరలు తెచ్చి నేత చీరలు అని మోసం చేశారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాదని, అద్దె బస్సులకు యజమానులుగా చేశామని అన్నారు. మహిళలు పెట్రోల్ బంకులు పెట్టుకుంటే భూమి కూడా ఇస్తున్నామని వివరించారు.

## తెలంగాణలో కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రాష్ట్రంలోని కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. 121 మున్సిపాలిటీల్లో ఎస్టీలకు 5, ఎస్సీలకు 17, బీసీలకు 38 మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులను కేటాయించారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ మేరకు మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

**వివిధ కార్పొరేషన్‌లకు ఖరారు చేసిన రిజర్వేషన్లు**

వివిధ కార్పొరేషన్‌లకు ఖరారు చేసిన రిజర్వేషన్లు ఈ విధంగా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్‌కు ఎస్టీ జనరల్, రామగుండం కార్పొరేషన్‌కు ఎస్సీ జనరల్, మహబూబ్ నగర్ కార్పొరేషన్ బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్ బీసీ జనరల్, కరీంనగర్ కార్పొరేషన్ బీసీ జనరల్, జీహెచ్ఎంసీ మహిళ జనరల్, గ్రేటర్ వరంగల్ జనరల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్ కార్పొరేషన్‌లలో మహిళ జనరల్‌ను ఖరారు చేశారు.

## 'సేవ్ సికింద్రాబాద్' ర్యాలీకి అనుమతి నిరాకరణ



**మొదటిపేజీ తరువాయి** – సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు.నగర అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంటే ప్రజలకు నిరసన తెలిపే హక్కు లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుగ్లక్ పనులు చేస్తోందని విమర్శించారు. సికింద్రాబాద్, హైదరాబాద్ నగరాలకు శతాబ్దాల చరిత్ర ఉందని అన్నారు. ఈ రెండు నగరాలు రెండు కళ్లు వంటివని, అలాంటిది వాటి ఐడెంటిటీని తొలగించాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని ఆరోపించారు.అరెస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాడతామని అన్నారు. రిపబ్లిక్ డేకు పది రోజుల ముందు తెలంగాణలో హక్కుల ఖూనీ జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుండటం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సికింద్రాబాద్ బిడ్డలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక సికింద్రాబాద్‌ను జిల్లాగా చేసే ఆలోచన చేస్తామని అన్నారు.

# సుస్థిర వరి సాగుకు ప్రోత్సాహం 216 మంది రైతులకు లబ్ధి

**ములుకనూరు సొసైటీ సుస్థిర వ్యవసాయానికి ముందడుగు**

**అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి**





**భీమదేవరపల్లి, జనవరి 17 (ప్రజా మంటలు) :** ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆవరణలో శనివారం రైతుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ పరిశోధనా సంస్థ అయిన జె - పిఎఎల్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులో, తడి - పొడి విధానంలో సుస్థిర వరి సాగు చేసిన రైతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట సీనియర్ సైంటిస్ట్ డా. యన్. వెంకటేశ్వర రావు తడి - పొడి పద్ధతిలో వరి సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గడం, దిగుబడి పెరగడం, చీడపీడల నియంత్రణలో మెరుగుదల వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. అనంతరం సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుకు ములుకనూరు సంఘం రైతులను ఎంపిక చేయడం గర్వకారణమన్నారు. సుస్థిర వరి సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలిక లాభాలు చేకూరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఎంపికైన 216 మంది రైతులకు, వారి తడిపొడి దశలను ఉపగ్రహ (సాటిలైట్) మానిటరింగ్ ఆధారంగా నిర్ధారించి, సుమారు రూ.8,15,000/- ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో సంఘ జనరల్ మేనేజర్ యం. రాం రెడ్డి, సౌత్ ఏషియా రీసెర్చ్ మేనేజర్ నితీష్ భరద్వాజ్, రీసెర్చ్ అసోసియేట్ నయన్ చంద్రా, లబ్ధిదారులైన రైతులు, సంఘ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి దేవస్థానంలో చండీ హవనం, కుంభాభిషేకం

**కొత్తకొండలో బ్రహ్మోత్సవాల ఉత్సాహం**

**అస్త్ర తీర్థ పుణ్యస్నానాలతో భక్తుల సందడి**





**భీమదేవరపల్లి జనవరి 17 (ప్రజా మంటలు) :** దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం నందు బ్రహ్మోత్సవాలు భక్తుల శ్రద్ధా భక్తులతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మాస శివరాత్రిని పురస్కరించుకొని శనివారం నిత్యాహ్నికం అనంతరం విశేషంగా రుద్రాభిషేకం సహిత చండీ హవనం నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన కార్యక్రమాలు భక్తుల మధ్య వేదోక్తంగా సాగాయి. తదనంతరం స్వామివారికి విశేష కుంభాభిషేకం నిర్వహించగా ఆలయ ప్రాంగణం వేద మంత్రోచ్చారణలతో మార్మోగింది. స్వామివారి మాడ వీధుల్లో అష్టభైరవార్చన, బలిహరణ కార్యక్రమాలు చేపట్టి ప్రస్తాయం చేశారు. అనంతరం స్వామివారి ఖడ్గాలు, శూలాలతో పవిత్ర కోనేరుకు చేరుకుని పుష్కరార్చన గావించి త్రిశూల స్నానము నిర్వహించారు. ఈ సందర్భంగా కోనేరులో భక్తులందరూ పుణ్యస్నానాలు ఆచరించారు. అస్త్ర తీర్థ స్నానం మహా పుణ్యప్రదమని, దీనివల్ల శరీర రుగ్మతలు నివారించబడతాయని శాస్త్రవచనంగా ప్రగాఢ విశ్వాసం ఉందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ పి కిషన్ రావు, వంగర ఎస్సై దివ్యతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొని ఉత్సవాలకు మరింత శోభను చేకూర్చారు.

# రాష్ట్రంలో కొత్తగా రాజకీయ కూటమి

**తొమ్మిది రాజకీయ పార్టీలతో కలసి తెలంగాణ రాజకీయ కూటమి ఏర్పాటు**

**వివరాలు వెల్లడించిన గాలి వినోద్కుమార్, కపిలవాయి దిలీప్ కుమార్**




**సికింద్రాబాద్, జనవరి 17 (ప్రజా మంటలు) :** రాష్ట్రంలో కొత్తగా రాజకీయ కూటమి ఏర్పాటు అయింది. తెలంగాణ ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) లో నమోదైన తొమ్మిది రాజకీయ పార్టీలు కలసి కొత్తగా తెలంగాణ రాజకీయ కూటమిగా ఏర్పడ్డాయి. తెలంగాణ రాజకీయ కూటమి కి సంబందించిన వివరాలను కూటమి అధ్యక్షులు మాజీ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, సెక్రటరీ జనరల్ కపిలవాయి దిలీప్ కుమార్ లు శనివారం వెల్లడించారు. ఈమేరకు కవాడిగూడ లోని రాష్ట్రీయ లోక్దళ్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా భావసారూప్య కలిగిన తొమ్మిది రాజకీయ పార్టీలతో తెలంగాణ రాజకీయ కూటమి పేరున కొత్త కూటమిని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి కలిసి పోటీ చేస్తుందన్నారు. తర్వాత 2028 లో వచ్చే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బడుగు వర్గాల మద్దతుతో రాజ్యాధికారం సాధిస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పక్షాలు కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ లు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయయని, ఇక ప్రజలు ఈ మూడు పార్టీలను నమ్మే స్థితిలో లేరన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ లో కోట్లాది ప్రజల సొమ్మును కొల్లగొట్టారని, ఇప్పుడు కాంగ్రెస్ అదే పంథాలో వెళ్తుందని విమర్శించారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ లో సామాన్యుడి దక్కింది ఏమీ లేదని, సబ్బండ వర్గాల సంక్షేమానికి తెలంగాణ రాజకీయ కూటమి వందశాతం కట్టుబడి ఉంటుందన్నారు. జనాభా దామాషా ప్రకారం తమ కూటమి సీట్లు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు కల్పిస్తుందని గాలి వినోద్ కుమార్, దిలీప్ కుమార్ లు అన్నారు. సమావేశంలో కూటమి ఉపాధ్యక్షులు మహాజన సేన పార్టీ తీగల ప్రదీప్ గౌడ్, ఈసీ మెంబర్ ఆధార్ పార్టీ డా.ఈడ శేషగిరి రావు, వర్కింగ్ ప్రెసిడెంట్, బహుజన రాజ్యం పార్టీ లాలు నాయక్ రామావత్, జనరల్ సెక్రటరీ ఇండియన్ క్రిస్టియన్ సెక్యులర్ పార్టీ డేవిడ్ ఆంద్రూ, టీఆర్ఎల్డీ నుంచి అధికార ప్రతినిధి గౌర బీరప్ప తో పాటు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కొత్తకొండ జాతరలో వాలంటీర్లకు టీ షర్ట్ల పంపిణీ

**భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి**



**భీమదేవరపల్లి, జనవరి 17 (ప్రజా మంటలు) :** కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సేవలు అందించేందుకు భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి వాలంటీర్లకు టీ షర్ట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో క్రమబద్ధమైన ఏర్పాట్లు అవసరమని, వాలంటీర్లు సేవాభావంతో బాధ్యతలు నిర్వహించాలని కోరారు. వాలంటీర్లు భక్తులకు దారి చూపడం, క్యూలైన్ పర్యవేక్షణ, తాగునీరు, అన్నప్రసాద పంపిణీ తదితర సేవల్లో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ పి కిషన్ రావు, ఎస్సై రాజు, పోలు శ్రీనివాస్, దొంగల కొమరయ్య, ఉప సర్పంచ్ ఐలయ్య, గుంటి ఓదేలు, శ్యాంప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రజా జ్యోతి క్యాలెండర్ ఆవిష్కరణ

**క్యాలెండర్ ఆవిష్కరించిన మండల పరిషత్ ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్**




**ఎల్కతుర్తి జనవరి 17 ప్రజా మంటలు :** ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార దిశగా పోరాడే ప్రజా జ్యోతి దినపత్రిక 2026 క్యాలెండర్ ను ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలు పతనమైపోతున్న ఈ సమయంలో పత్రిక విలువలను కాపాడే విధంగా అన్యాయాన్ని ప్రశ్నించే విధంగా ప్రభుత్వానికి ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా ప్రజా జ్యోతి దినపత్రిక నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్, సూపరెంటెంట్ కె. శ్రీనివాస్ గౌడ్, టైపిస్ట్ ఆర్. రజిని,ఓఎస్. వెంకటేష్, ఓ ఎస్. వెంకటేష్ కుమార్, ఓ ఎస్.సుమన్,ఈసీ. శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, జూనియర్ అసిస్టెంట్ రమేష్, సబర్డేంట్ కుమారస్వామి ఆఫీస్ సిబ్బంది, ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కందుకూరి రాజన్న, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు సుద్దాల జయప్రసాద్, ఆర్టీసీ డ్రైవర్ గూడెల్లి రాములు, జడ్సన్, తదితరులు పాల్గొన్నారు

# జగిత్యాలలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఇద్దరు యువకులు మృతి, ఒకరి పరిస్థితి విషమం**



**జగిత్యాల, జనవరి 18 (ప్రజా మంటలు) :** జగిత్యాల పట్టణంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.జగిత్యాలకు చెందిన నవనీత్, సాయి తేజ, ధరూర్‌కు చెందిన సృజన్ అనే ముగ్గురు యువకులు సంక్రాంతి సెలవుల సందర్భంగా జగిత్యాలకు వచ్చారు. స్నేహితులతో కలిసి జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల ప్రాంతంలో పార్టీ ముగించుకుని కారులో తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది.మద్యం మత్తులో అతివేగంగా నడుపుతున్న కారు ముందుగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, అనంతరం డివైడర్‌ను తాకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు.వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా, నవనీత్, సాయి తేజ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సృజన్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.సమాచారం అందుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అతివేగం, మద్యం మత్తే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు.

# జగిత్యాల, రాయికల్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం దిశా నిర్దేశం చేసిన మాజీ మంత్రి కొప్పుల





**జగిత్యాల జనవరి 17 (ప్రజా మంటలు) :** జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ రావు అధ్యక్షతన జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల ఎన్నికల సన్నాహకపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ , కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , ఎమ్మెల్సీ ఎల్ రమణ , జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి రాజేశం గౌడ్ , జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు ఈ సమావేశానికి హాజరయ్యారు.మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార పార్టీకి ధన బలం, అధికార బలం ఉంటాయని, కానీ బీఆర్ఎస్‌కు ప్రజాబలం ఉందని నొక్కి చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం లో జరిగిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల మనసులో ఉన్నాయని ఈశ్వర్ పేర్కొన్నారు.అధికార పార్టీ డబ్బు, అధికారంతో పోటీ చేసినా, ప్రజల మద్దతు బీఆర్ఎస్ కు బలమని ఆయన తెలిపారు.పార్టీ మారిన వారి గురించి బాధపడాల్సిన అవసరం లేదని, బిఆర్ ఎస్ ఉద్యమ పార్టీ, ఇలాంటి ఒడిదుడుకులు చూసిన పార్టీ అని గుర్తు చేశారు.రానున్న ఎన్నికల వ్యూహాలను, ప్రజల సమస్యలను చర్చించి గెలుపు మార్గాల్లో ముందుకు సాగాలని నిర్దేశించారు.జగిత్యాల జిల్లాను 2016లో కెసిఆర్ ప్రభుత్వం ఏర్పరచింది. బీఆర్ఎస్ పాలిత ప్రభుత్వం కాలంలో మెడికల్ కాలేజీ, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయబడ్డాయి.జగిత్యాల జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికల విజయాలను కెసిఆర్‌కు బహుమతిగా సమర్పించాలని పిలుపునిచ్చారు.

# పదవి విరమణ పొందిన హోమ్ గార్డ్ కొమురయ్య కి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు




**జగిత్యాల జనవరి 17(ప్రజా మంటలు) :** పోలీస్ శాఖలో గత 35 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న హోమ్ గార్డ్ కొమురయ్య ను జిల్లా పోలీస్ కార్యాలయంలో రిజర్వు ఇన్స్పెక్టర్ సైదులు గారు పూలమాల వేసి శాలువ లతో ఘనంగా సన్మానించారు.సుధీర్ఘ కాలంగా పోలీస్ శాఖ లో విధులు నిర్వహించి సేవలు మరువమని అన్నారు.పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు.ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని అన్నారు.ఈ కార్యక్రమశీ లో హెడ్ కానిస్టేబుల్ బీమ్ రావు, కానిస్టేబుల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# అవినీతి కవలలుగా బీజేపీ - బీఆర్ఎస్

**మేడిపల్లి సత్యం**



**కరీంనగర్, జనవరి 17 (ప్రజా మంటలు) :** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పాలనలో కరీంనగర్ నగరం అవినీతికి అడ్డాగా మారిందని డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆరోపించారు.నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీబీఆర్ఎస్ అవినీతి కవలలుగా ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్నాయని విమర్శించారు. పార్టీలు మారుతున్నా అవినీతి మారడం లేదన్నారు.రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 శాతానికి తగ్గకుండా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం విస్తృతంగా అమలవుతోందని తెలిపారు.కరీంనగర్ అభివృద్ధి కోసం ఈసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని నగర ప్రజలను కోరారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మేనేని రాజనర్సింగ్ రావు, ముద్దం తిరుపతి, ముద్దసాని రంగన్న, బానోతు శ్రవణ్ నాయక్, కొర్వి అరుణ్ కుమార్, రామిడి రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, లింగంపల్లి బాబు, సిరికొండ శివప్రసాద్, నెల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# జెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత త్రాగునీటి సేవలు

**వీరభద్ర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**

**కో. ఆర్డినేటర్ కాశిరెడ్డి నరేందర్ రెడ్డి**




**భీమదేవరపల్లి, జనవరి 17 (ప్రజా మంటలు) :** భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన జెఎస్ఆర్ అన్న చలివేంద్రాలు విశేషంగా ఉపయోగపడుతున్నాయి.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెఎస్ఆర్ ఆదేశాల మేరకు జెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తకొండ గ్రామంలో మొత్తం 6 ఉచిత త్రాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కో.ఆర్డినేటర్ కాశిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. వీరభద్ర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు త్రాగునీటి కొరత లేకుండా ఏర్పాట్లు చేయడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ సేవా కార్యక్రమం భక్తుల దాహార్తిని తీర్చడమే కాకుండా ఆలయ బ్రహ్మోత్సవాలకు మరింత శోభను చేకూరుస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అందరూ ఈ ఉచిత త్రాగునీటి సౌకర్యాన్ని వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నాటి జ్ఞాపకాలు, గౌరవం, అపురూపం

**1992 టెన్త్ బ్యాచ్ రీయూనియన్**




**భీమదేవరపల్లి, జనవరి 17 (ప్రజా మంటలు) :** గట్లనర్సింగపూర్ ప్రభుత్వ పాఠశాలలో 1992 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావేరి సీడ్స్ ఎండి భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టాన్ని నమ్ముకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని, తెలివిని సద్వినియోగం చేసుకుంటే ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లగలరని సూచించారు. పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను, ఒక్కొక్కరి జీవిత ప్రయాణంలోని కష్టనష్టాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమ్మేళనాన్ని బానోత్ సురేష్ నాయక్ సమర్థవంతంగా నిర్వహించి, అందరినీ ఒకచోట చేర్చి సంబరాల వాతావరణం నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాటి అధ్యాపకులు సంజీవ రెడ్డి,లింగారెడ్డి, రమేష్ హాజరై పూర్వ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు సంపత్, రవీంద్ర చారీ, ఐలయ్య, అశోక్, రామారావు, శ్రీనివాస్, రవి, రాజేశ్వర్ రావు, మంగ, ప్రేమలత, స్వర్ణలత, కోమలత, ధనలక్ష్మి, మంజుల తదితరులు పాటలు, ఆటలతో ఆనందంగా పాల్గొన్నారు.

# 'ఎస్.ఆర్.ఆర్ లో కార్టూన్ల శిక్షణ-ప్రదర్శన'

**ప్రజా మంటలు :** ఈ నెల 19 నుండి 20 వ తేదీ వరకు రెండు రోజుల పాటు తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో కరీంనగర్ లోని ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగము సహకారంతో తెలంగాణ కార్టూనిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యువతరం కోసం కార్టూన్ కళపై ఆసక్తి పెంచే ఉద్దేశంతో వర్ధమాన కార్టూనిస్టులను ప్రోత్సహించే సంకల్పంతో కార్టూన్ శిక్షణా శిబిరం మరియు కార్టూన్ల ప్రదర్శన నిర్వహించబడుతుంది. కావున ఔత్సాహికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షులు జకీర్ హుస్సేన్,కార్యదర్శి వేముల రాజమౌళి ఓ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు,జోనల్ సెక్రెటరీలు,పలువురు కార్టూనిస్టులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు శోభనిచ్చిన పుష్పయాగం

**వీరభద్ర స్వామి ఆలయంలో పుష్పయాగ వైభవం**

**ఆలయ ఈఓ పి. కిషన్ రావు**



**భీమదేవరపల్లి జనవరి 17 (ప్రజా మంటలు) :** శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో పుష్పయాగం భక్తుల ఆధ్యాత్మికోత్సాహం నడుమ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పయాగము ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్త విధానాలతో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పుష్పాలతో యాగక్రియను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తుల నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అలాగే ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ దంపతులు ప్రత్యేకంగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. పుష్పయాగం నిర్వహణతో బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తామని ఈఓ కిషన్ రావు తెలిపారు.

# ఘనంగా కనుమ పండుగ

**కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో సంప్రదాయ ఉత్సవాలు**



**భీమదేవరపల్లి, జనవరి 17 (ప్రజా మంటలు) :** కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలలో భాగంగా కనుమ పండుగను శుక్రవారం సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పంటలకు సహకరించిన ఆవులు, ఎద్దులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పక్షుల కోసం ఇంటి గుమ్మాలకు ధాన్యపు కంకులు వేలాడదీయడం ఆనవాయితీగా చేశారు. కనుమ సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నందీశ్వరునికి అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.

# మేడారం జాతరకు వెళ్లలేకపోతున్నారా?

**రూ.299 చెల్లిస్తే ఇంటి వద్దకే ప్రసాదం**

**ప్రసాదం ప్యాకెట్‌లో అమ్మవార్ల ఫొటోతో పాటు బెల్లం, పసుపు, కుంకుమ**

**వెబ్‌సైట్ ద్వారా లేదా టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్‌లలో బుక్ చేసుకునే వెసులుబాటు**

**వెల్లడించిన ఆర్‌టీసీ ఎండీ వై.నాగిరెడ్డి**



మేడారం మహాజాతర నేపథ్యంలో ప్రత్యేక సేవలు అందించనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ తెలిపింది. రూ.299 చెల్లిస్తే ఇంటి వద్దకే సమ్మక్క-సారలమ్మ బంగారం ప్రసాదాన్ని ఇవ్వనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. వివిధ రకాల కారణాలతో మేడారం వెళ్లలేని వారి కోసం దేవాదాయ శాఖ సహకారంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపింది. ప్రసాదం ప్యాకెట్‌లో అమ్మవార్ల ఫొటోతో పాటు బెల్లం, పసుపు, కుంకుమ ఉంటాయి. భక్తులు వెబ్‌సైట్ ద్వారా లేదా టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్‌లలో ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చని ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి వెల్లడించారు. వివరాలకు ఆర్‌టీసీ కాల్‌సెంటర్లు 040-69440069, 040-23450033 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

**సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం :**

వన దేవతలు సమ్మక్క – సారలమ్మల చరిత్ర, భక్తుల విశ్వాసాలకు వేదికలైన మేడారం గద్దె ప్రాంగణం శతాబ్దాల పాటు నిలిచేలా రూపొందుతోంది. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా జారత నేపథ్యంలో మేడారం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.251 కోట్లతో శ్రీకారం చుట్టింది. మరో రూ.150 కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కేటాయించింది. దీనితో శాశ్వత పనులు చేపట్టింది. రూ.101 కోట్లతో గద్దెల ప్రాంగణాన్ని గ్రానైట్ శిలలతో పునర్నిర్మించింది. ఈ పనులు అంతిమ దశకు చేరుకున్నాయి. దీంతో ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఆదివాసీ పెద్దల పర్యవేక్షణలో నిర్మాణం :**

ఆదివాసీలు, నిపుణుల పర్యవేక్షణలో నిర్మాణంపై ఆదివాసీల ఆచారాలు, సంస్కృతులపై సుదీర్ఘంగా అధ్యయనం చేశారు. దీని ఆధారాంగా ఓ బృహత్ ప్రణాళికను రూపొందించారు. స్తపతులు, శిల్పులు ఆదివాసీ పెద్దల పర్యవేక్షణలో సమ్మక్క – సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం, విస్తరణ చేపట్టారు. పైకప్పు లేకుండా జరుగుతున్న నిర్మాణం కావడంతో వేసవి కాలంలో ఎక్కువ వేడెక్కకుండా ఉండేందుకు తెలుపు రంగు గ్రానైట్‌ను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటి నుంచి రాళ్లను ఆళ్లగడ్డకు తరలించారు. అక్కడ శిల్పులు వాటి ఆకృతులుగా మలిచిన తర్వాత మేడారానికి తీసుకువచ్చారు. రాళ్లపై కోయ వంశీయుల 7 వేల ఏళ్ల చరిత్రను తెలిపేలా 250 మంది శిల్పులు చిత్రాలను చెక్కారు.

**వంద రోజుల్లోనే పూర్తి :**

గద్దెల పునర్నిర్మాణాన్ని 2025 అక్టోబర్‌లో ప్రారంభించారు. 600 కిలోమీటర్ల దూరంలోని ఆళ్లగడ్డ నుంచి రాతి శిలలు తీసుకొచ్చి, భారీ క్రేన్‌లతో అమర్చే పనులు రాత్రింబవళ్లు సాగాయి. గత 4 వారాలుగా భక్తులు రద్దీతో కొంతమేర ఆటంకాలు ఏర్పడినా, పనులు కొనసాగించారు. యంత్రాల మొరాయింపు, ఇతర అవరోధాలను అధిగమిస్తూ దాదాపు 100 రోజుల్లోనే ఈ నిర్మాణ ప్రక్రియను ముగించారు. గద్దెల ప్రారంభోత్సవానకి సోమవారం ఉదయం ముహూర్తం ఖరారు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం మేడారానికి చేరుకుని మంత్రి మండలి సమావేశంలో పాల్గొంటారు. అక్కడే బసచేసి మరుసటి రోజు ఉదయం ప్రారంభిస్తారు. ఏర్పాట్లను మంత్రులు పొంగులేటి, సీతక్క పర్యవేక్షిస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి దగ్గరలో చెక్కిన శిలను ప్రారంభోత్సవ శిలాఫలకంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**3,495 ప్రత్యేక బస్సులు :**

ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారంలో సమ్మక్క – సారలమ్మ జాతర వైభవంగా జరగనుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి 3,495 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది. అవసరమైతే మరిన్ని బస్సులు నడిపే విధంగా కార్యాచరణ ఉంటుందని వెల్లడించింది. వీటిలో సాధారణ ఛార్జీకి 50 శాతం అదనపు మొత్తాన్ని జోడించి వసూలు చేయనున్నట్లు పేర్కొంది. ప్రత్యేక పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు ఛార్జీలు పెంచుకునేందుకు ఆర్టీసీకి 2023 నుంచి అనుమతి ఉంది.

# తెలంగాణలో అత్యంత పేదలకు ప్రభుత్వ సాయం

**త్వరలోనే సర్వే! - అర్హతలు ఇవే**

**తెలంగాణలో అత్యంత పేదలను ఆదుకోవాలని ప్రభుత్వ నిర్ణయం**

**ఆ వర్గాన్ని గుర్తించేందుకు త్వరలో కేరళ తరహాలో సమగ్ర సర్వే**

**నమూనా సర్వే ప్రతిపాదనలు సిద్ధం**

**సీఎం ఆమోదముద్ర వేయగానే స్టార్ట్**



రాష్ట్రంలో అత్యంత పేదవారిని (అల్ట్రాపూర్) ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు కేరళ అనుసరించిన విధానాన్ని ఫాలో కానుంది. ఈ మేరకు బడుగు జీవులను గుర్తించడం, వారి అవసరాల అంచనా ప్రణాళికను రూపొందించే బాధ్యతను గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సెర్ప్ (రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ)కు అప్పగించారు. సెర్ప్ ఇప్పటికే టీజీఐఎల్‌పీ (తెలంగాణ సమ్మిళిత జీవనోపాధుల కార్యక్రమం) కింద 5 జిల్లాల్లోని 8 మండలాల్లో సర్వే నిర్వహించింది. అత్యంత పేదరికం అనుభవిస్తున్న 8 వేల కుటుంబాలను గుర్తించింది. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అత్యంత పేద కుటుంబాలను ప్రజా భాగస్వామ్యంతో గుర్తించేలా నమూనా సర్వే ప్రతిపాదనలను సిద్ధం చేయగా, మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి వద్దకు చేరగా, ఆయన ఆమోదం తర్వాత సర్వే ప్రారంభం కానుంది.

**ప్రజల మధ్యన - ప్రజల భాగస్వామ్యంతో :**

ఈ సర్వే కోసం గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు ఊరిలోని అన్ని వీధుల్లో కాలినడక తిరుగుతారు. ఆపై పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ చిత్రపటం(మ్యాప్) వేస్తారు. ఆ మ్యాప్‌లో ప్రజలు నివసిస్తున్న ఇళ్ల స్వరూపాన్ని (పక్కా ఇళ్లు, కచ్చా ఇళ్లు, గుడిసెల బొమ్మలు) గీస్తారు. అనంతరం ఊరందరి సమక్షంలో ఎలాంటి ఇళ్లల్లో ఎవరు ఉంటున్నారో, వారి సామాజిక స్థితిగతులు ఏంటో తెలిపేలా కార్డులపై రాస్తారు. వాటిని ఆయా ఇళ్ల బొమ్మలపై ఉంచుతారు. తర్వాత అందరి సమ్మతితో అత్యంత నిరుపేద కుటుంబాల ప్రాథమిక జాబితా తయారు చేస్తారు. ఆయా కుటుంబాల వద్దకు నేరుగా వెళ్లి వారి వివరాలు తీసుకుంటారు. అనంతరం మహిళా సంఘం సమావేశంలో చర్చించి తుది జాబితాపై తీర్మానం చేస్తారు. ఊరి పరిధి, నివసించే జనాభాను బట్టి 3 నుంచి 5 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది.

**మూడంచెల ధ్రువీకరణ :**

గ్రామ స్థాయిలో రూపొందించిన ఈ జాబితాను మండల సమాఖ్యకు సమర్పిస్తారు. ఆ సమాఖ్యకు సంబంధించిన నలుగురు ప్రతినిధులు ఊరికి వచ్చి తమకు అందిన లిస్ట్ ఆధారంగా మరోసారి తనిఖీ చేస్తారు. ఆయా కుటుంబాల ఆర్థిక స్థితి, ఆదాయ వనరులు, ఆహార భద్రత, జీవనస్థితి గురించి తెలుసుకుంటారు. అనంతరం గ్రామస్థులతోనూ మాట్లాడి నిర్ధారణ చేసుకుంటారు. జాబితాలోని ఫ్యామిలీ ఒకవేళ ఎట్టైనా వలస వెళితే ఇరుగుపొరుగు వారిని అడిగి ధ్రువీకరించుకుంటారు. ఈ క్రమంలో ఎవరైనా అభ్యంతరాలు తెలిపితే వాటిని పరిగణనలోనికి తీసుకుని తుది జాబితా తయారు చేస్తారు. తర్వాత ఈ జాబితాను ఎంపీడీవోలకు సమర్పిస్తారు. వారు సైతం గ్రామ కార్యదర్శి ద్వారా మరోసారి పరిశీలింపజేసి ఫైనల్‌గా డీఆర్‌డీవో (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) అధికారులకు అందజేస్తారు. వారు జిల్లా పాలనాధికారి (కలెక్టర్)కి సమర్పించగా, ఆయన పరిశీలించి అర్హులను అధికారికంగా ప్రకటించడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది.

# నాలుగేళ్ల నిరీక్షణకు తెర

**అందుబాటులోకి చీపురుపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి**

**వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో గత నాలుగేళ్ల క్రితం భారీ వాహనాల రాకపోకలను నిలిపివేత**

**కూటమి ప్రభుత్వం చొరవతో ఈ నెల 10న వంతెన ప్రారంభం**



నాలుగు జిల్లాల ప్రజల ఇబ్బందులు, నాలుగేళ్ల నిరీక్షణకు కూటమి ప్రభుత్వం తెరదించింది. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)ని పూర్తి చేసి సంక్రాంతికి ముందే అందుబాటులోకి తెచ్చింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఈ ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇక వాహనదారులు ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా ఈ మార్గంలో ప్రయాణించవచ్చు. ఎట్టకేలకు వంతెన ప్రారంభం కావడంతో ఇకపై ప్రయాణ ప్రయాసలు తప్పుతాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీసులు :** విజయనగరం జిల్లా చీపురుపల్లిలో రైల్వే ట్రాక్‌ను దాటేందుకు వందేళ్ల క్రితం పైవంతెన నిర్మించారు. విశాఖ, విజయనగరం నుంచి రాజాం, మన్యం జిల్లా పాలకొండ వైపు వేలాది వాహనాలు ఈ బ్రిడ్జి మీదుగా ప్రయాణం సాగిస్తుంటాయి. ఇంజినీరింగ్ బృందం సూచనల మేరకు రైల్వే అధికారులు 2022 మేలో ఈ వంతెనపై పెద్ద వాహనాల రాకపోకలను నిలిపేశారు. దీంతో ఆర్టీసీ సర్వీసులు ఆగిపోయాయి. ఫలితంగా విజయనగరం – రాజాం, పాలకొండల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు 40 కిలోమీటర్లు దూరం అదనంగా ప్రయాణించాల్సి వచ్చింది. మరికొందరు చీపురపల్లి వంతెన వరకు ఒక బస్సులో వచ్చి, వంతెన దాటి మళ్లీ మరో బస్సు ఎక్కాల్సిన పరిస్థితి గతంలో నెలకొంది. **12.97 కోట్ల రూపాయలు మంజూరు :** నిత్యం వేలాది మంది ప్రయాణికుల రాకపోకలకు కీలకమైన పైవంతెన పనులను త్వరగా పూర్తి చేయాల్సి ఉన్నా గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. 2022 ఆగస్టు 16న ఆర్వోబీ పనులకు రైల్వే బోర్డు 12.97 కోట్ల రూపాయలు మంజూరు చేసినా, 2023 మార్చి వరకు పనులు ప్రారంభించలేదు. మొదలైన పనులూ మూడేళ్ల పాటు నత్తనడకన సాగాయి. దీంతో నాలుగు జిల్లాల ప్రజలకు ప్రయాణం భారంగా మారింది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం చొరవతో ఈ నెల 10న ఈ వంతెన అందుబాటులోకి వచ్చింది. చీపురుపల్లి రైల్వే వంతెన పునః ప్రారంభం కావటంతో విద్యార్థులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్టీసీకి తిరిగి ఆదాయం :** వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో గత నాలుగేళ్ల క్రితం భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఆర్టీసీ బస్సులు, లారీలతోపాటు ఇతర రవాణా వాహనాలన్నీ గరివిడి, గర్భం మీదిగా చుట్టూ తిరిగి రాకపోకలు సాగించేవి. రైల్వే శాఖ మంజూరు చేసిన నిధులతో 2023 మార్చిలో ఆర్‌ఓబి నిర్మాణ పనులు ప్రారంభించారు. నాలుగేళ్లుగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఎట్టకేలకు పనులు పూర్తిగా కావడంతో వంతెనను ప్రారంభించారు. గత నాలుగేళ్లుగా పడుతున్న ఇక్కట్లు తీరాయంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి రైల్వే పైవంతెన నుంచి రాకపోకలు నిలిచిపోవటంతో పాలకొండ ఆర్టీసీ డిపో నాలుగేళ్ల పాటు నిత్యం లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోయింది. వంతెన పునః ప్రారంభం కావటంతో ఆర్టీసీకి ఆదాయం తిరిగి సమకూరనుంది."గతంలో విద్యార్థులు, ఉద్యోగులు ఈ బ్రిడ్జి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఈ ఆర్వోబీ పనులు జరగకుండా నిలిచిపోయాయి. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఈ ఆర్వోబీపై దృష్టి సారించి, వేగంగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. ప్రజలకు అందుబాటులకి తీసుకొచ్చారు. చాలా సంతోషంగా ఉంది."

## సిపి ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ ఆవరణలో ముగ్గుల పోటీలు



**ఎల్కతుర్తి జనవరి 17 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఆవరణంలో సిపి ఆదేశాల మేరకు నేషనల్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను పుష్కరించుకొని స్టేషన్ ఆవరణంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రజల్లో రవాణా నియమాలపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మునిగడప లావణ్య, శేషగిరి, మార్కెట్ చైర్మన్ సుకినే సంతాజి కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ అనితా దేవి, పిటి స్వరూప, వీరితో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ, హెల్మెట్ తప్పనిసరి ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం. జీవితం అమూల్యం జాగ్రత్తగా వాహనం నడపండి వంటి నినాదాలు చేస్తూ ప్రజలను, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు వేగవంతమైన డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ సీటుబెల్ట్ వినియోగం లేకపోవడమేనని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. విద్యార్థులే రోడ్డు భద్రతపై సమాజాన్ని చైతన్యపరిచే రాయబారులని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగితే భవిష్యత్తులో ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక పోలీసులు ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై పలు సూచనలు అందించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వాడాలి, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపరాదని సూచించారు. నేషనల్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెరిగిందని, ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని పోలీస్ అధికారులు తెలిపారు.

## ఎస్.కె.ఎన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, అభివృద్ధికి సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ, శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.



**జగిత్యాల జనవరి 17 ( ప్రజా మంటలు) :** ఎస్.కె.ఎన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ( ఎస్ కె ఎన్ ఆర్ జి ఏ ఎస్ సి), జగిత్యాల యాజమాన్యం మరియు అధ్యాపక బృందం, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలుసుకుని కళాశాల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కోసం మహిళలు మరియు పురుషులకు వేర్వేరు వసతి గృహాలు (హాస్టల్స్), ఆడిటోరియం నిర్మాణం, అలాగే కొత్త పీజీ ( పోస్ట్ గ్రాడ్యుయేట్) కోర్సుల మంజూరు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి ని అభ్యర్థించారు. ఈ సదుపాయాలు అమలులోకి వస్తే, జగిత్యాల ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య మరింత అందుబాటులోకి వస్తుందని వివరించారు. వినతిపత్రానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్.కె.ఎన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు మరియు సిబ్బంది అంతా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూల స్పందనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతిపాదిత వసతులు మరియు విద్యా విస్తరణలు త్వరలోనే అమలులోకి వచ్చి, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతాయని కళాశాల వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఏ. శ్రీనివాస్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఆఫీసర్, జూలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. పర్లపల్లి రాజు, వాణిజ్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అంకం గోవర్ధన్, కళాశాల అధ్యాపకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ శాంతి ర్యాలీ లో ఉద్రిక్తత

**అనుమతి లేదని పోలీసుల అడ్డంకులు**

**నాయకుల అరెస్టులు...పలు పీఎస్ లకు తరలింపు**

**పోలీస్టేషన్ ల వద్ద ఉద్రిక్త వాతావరణం**





**సికింద్రాబాద్, జనవరి 17 ( ప్రజామంటలు) :** సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ శనివారం నిర్వహించిన శాంతి ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది. ర్యాలీకి అనుమతి లేదని పేర్కొంటూ పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. బీఆర్ఎస్ ర్యాలీకి అనుమతి నిరాకరించడమైనది అంటూ నార్త్ జోన్ జాయింట్ సీపీ ఉదయం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నేపద్యంలో ర్యాలీగా బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి సిటీలోని పలు పోలీసు స్టేషన్లకు తరలించారు. దీంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చిన నేపథ్యంలో లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు నల్ల జెండాలు, కండువాలతో రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అనుమతి లేకుండా ప్రదర్శనలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ముందుగానే హెచ్చరించారు. అయినప్పటికీ ర్యాలీ కొనసాగించేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత తలసాని సాయి కిరణ్ యాదవ్ నల్ల దుస్తులు ధరించి, నల్ల రంగు బెలూన్లతో 'సికింద్రాబాద్ బచావో...అంటూ నినాదాలు చేస్తూ గాంధీ విగ్రహం వైపు వెళ్లే ప్రయత్నం చేయగా, వ్యాన్ లో బలవంతంగా ఎక్కించిన పోలీసులు అరెస్టు చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరసన చేపట్టినా అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన ఆరోపించారు. సికింద్రాబాద్ చరిత్ర, అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు తమ ఉద్యమం కొనసాగుతుందని, ఫిబ్రవరి మొదటి వారంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ నివాసం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ఆయనను హౌజ్ అరెస్ట్ చేశారు. చిలకలగూడ వైపు నుంచి ర్యాలీగా బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను చిలకలగూడ చౌరస్తా వద్ద అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద అరెస్టు చేసి రాంగోపాల్పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయా పోలీస్ స్టేషన్ ల వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. శాంతియుతంగా చేస్తున్న ర్యాలీని అడ్డుకోవడం ప్రభుత్వానికి తగదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com